



## శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ): క్రిస్మస్ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావును తెలంగాణ పుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనకు కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ నెహేమియా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేసీఆర్‌ను కలిసినవారిలో క్రిస్టియన్ జేఏసీ నాయకులు సాల్మన్ రాజు, న్యూలైఫ్ చర్చిస్ బిషప్ నెహేమియా, క్యాథలిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లియో లూయిస్ తదితరులు ఉన్నారు.



ప్రభు ప్రార్థనలో యువతి

# క్రిస్మస్ సందడి

*నగరంలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చి, తదితర చర్చిలు రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళలాడాయి. క్రిస్మస్ తాత బహుమతులు, పలు చోట్ల కేక్ కట్ చేసి సందడి చేశారు. క్రిస్మస్ ట్రీలు, శాంతా క్లాజ్‌లు ఆకట్టుకున్నాయి. మియాపూర్‌లోని కల్వరీ టెంపుల్ భక్తులతో కిటకిటలాడింది. 4 లక్షలకు పైగా భక్తులు పలు ప్రాంతాల నుంచి విచ్చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేకంగా క్రీస్తు గీతాలాపనలు చేశారు. క్రిస్మస్ ట్రీ వద్ద భక్తులు పిల్లలతో కలిసి సెల్ఫీలు దిగి సందడి చేశారు.*

## భక్తిశ్రద్ధలతో వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకున్న శాంతాక్లాజ్‌లు
- క్రిస్మస్ ట్రీ వద్ద సెల్ఫీలు దిగిన చిన్నారులు














సెయింట్ మేరీస్ చర్చిలో..







అబిడ్స్ చర్చిలో..





## ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించడంతోనే ఇమాం, మౌజంలకు వేతనాలు

**బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం**

**రాష్ట్ర మైనార్టీ నాయకుడు బద్రుద్దీన్**

అబిడ్స్, డిసెంబర్ 25: ఇమాం, మౌజంల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలిలో ప్రశ్నించడంతో వేతనాలు విడుదలయ్యాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఎంకే బద్రుద్దీన్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో ఇమాం, మౌజంలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బద్రుద్దీన్ మాట్లాడుతూ ఇమాం, మౌజంలకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ కవిత శాసనమండలిలో ప్రస్తావించడంతో ప్రభుత్వం వెంటనే రెండు రోజులలో వేతనాలు విడుదల చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందలాది ఇమాం, మౌజంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు తిరిగి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. తిరిగి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



ఎమ్మెల్సీ కవితను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎంకే బద్రుద్దీన్, ఇమాం, మౌజంలు

## నుమాయిష్ వచ్చేసిందోచ్

- ఒకటో తేదీ నుంచి ప్రారంభం
- 46 రోజుల పాటు నిర్వహణ
- పది రూపాయలు పెరగనున్న ప్రవేశ రుసుము



అబిడ్స్, డిసెంబర్ 25: నగరంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)ను జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభించేందుకు గాను సొసైటీ ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా స్టాల్‌ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నుమాయిష్ ప్రారంభోత్సవం నాటికి స్టాల్‌లు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి పదిహేనవ తేదీ వరకు 46 రోజుల పాటు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను నిర్వహిస్తారు. పారిశ్రామిక ప్రదర్శనకు గాను దాదాపు 2500 స్టాళ్ల నిర్మాణం చేసేందుకు గాను నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు స్టాళ్ల కేటాయింపు చివరి దశకు చేరుకుంది. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు, మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎగ్జిబిషన్‌కు జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి లభించగా ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల స్టాళ్లు, ఫుడ్ కోర్టులు, సందర్శకులను అలరించేందుకు గాను అమ్యూజ్‌మెంట్ పార్క్ ఇలా అనేక స్టాళ్లు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయి.

### ప్రవేశ రుసుము రూ.50..

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్) ప్రవేశ రుసుమును 50 రూపాయలుగా ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీలో నిర్ణయం తీసుకున్నట్లు సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్ తెలిపారు. ఇప్పటి వరకు 40 రూపాయలుగా ఉన్న ప్రవేశ రుసుము పది రూపాయలు పెంచి 50 రూపాయలుగా నిర్ణయించినట్లు వివరించారు. పెరిగిన ప్రవేశ రుసుము జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్ నుంచి అమలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

### కొనసాగుతున్న స్టాళ్ల పనులు

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు వచ్చే సందర్శకుల కోసం మరిన్ని వసతులు కల్పిస్తున్నాం. ఎగ్జిబిషన్‌ను పురస్కరించుకుని స్టాల్‌ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేకంగా మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయాలను పెంచనున్నాం. స్టాల్‌ల కేటాయింపులో కూడా సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

*– నిరంజన్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు*

### సందర్శకులకు మరిన్ని వసతులు

ఎగ్జిబిషన్ నిర్వహించే 46 రోజుల పాటు సందర్శకులకు అన్ని రకాల వసతులు కల్పించనున్నాం. సందర్శనకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటాం. నుమాయిష్ సందర్శనకు వచ్చే సందర్శకులకు పూర్తి స్థాయి భద్రత కల్పించేందుకు గాను మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నాం ప్రత్యేక సెక్యూరిటీని ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తాం.

*– మోహన్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్త కార్యదర్శి*

## దరఖాస్తుల ఆహ్వానం

రవీంద్రభారతి, డిసెంబర్ 25: ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశానికి నేటి నుంచి ఫిబ్రవరి వరకు ఆన్‌లైన్లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కిష్టాపూర్ మేడ్చల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత ఒక ప్రకటనలో కోరారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా చేసుకొని ప్రవేశాలు ఉంటాయని వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న ప్రవేశ పరిక్ష ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తుకు https ; tgswreis. cgg,gov.in వెబసైట్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

## డప్పు కళాకారుల సంఘం నూతన కార్యవర్గం



రవీంద్రభారతి,డిసెంబర్ 25: తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఆరికంటి పుల్లారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొంగర సైదులు, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర అంబేద్కర్, కోశాధికారిగా కాటిక శంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా సుంచు లింగయ్య, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొంగర సైదులు పాల్గొన్నారు.